
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 2 సెప్టెంబరు 2024


వేములవాడలో వాగును పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ


రుద్రంగి మండలం మానాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న తాతమ్మ వాగు


వేములవాడలో పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్


వేములవాడ గంగమ్మ గుడి వద్ద మూలవాగు ప్రవాహం

జోరువాన

- జిల్లాలో భారీవర్షం ● పొంగుతున్న వాగులు, చెరువులు
- నీట మునిగిన పంటలు
- మత్తడి దూకుతున్న ఎగువ మానేరు ప్రాజెక్ట్
- మిడ్ మానేరులోకి భారీగా ఇన్‌ఫ్లో
- ఇళ్లలోకి వరద నీరు ● అప్రమత్తమైన అధికారులు
- వరద ప్రాంతాలను పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎస్పీ
- సిరిసిల్ల పరిస్థితిని సమీక్షించిన మాజీ మంత్రి కేటీఆర్
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం
- జిల్లాలో 69.04 మిల్లీమీటర్ల వర్షం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో శనివారం రాత్రి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ఆదివారం రోజంతా కుండపోత వర్షానికి జిల్లాలో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సిరిసిల్ల మానేరు, వేములవాడ మూలవాగులతోపాటు వరద ప్రవహించింది. జిల్లాలో చెరువులు, కుంటలు అలుగుదూకుతున్నాయి. పలు ప్రాంతాల్లోని ఒర్రెలు, వాగులు వరదనీటితో పోటెత్తగా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, అధికార యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంతాలను పరిశీలించింది. జిల్లాలో ఆదివారం సాయంత్రం వరకు 69.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎల్లారెడ్డిపేట 10.6 మిల్లీమీటర్లు, గంభీరావుపేట 60.8, ముస్తాబాద్ 71.3, తంగళ్లపల్లి 77.1, ఇల్లంతకుంట 72.3, రుద్రంగి 50.8, చందుర్తి 89.4, వేములవాడ రూరల్ 47.9, బోయినపల్లి 52.2, వేములవాడ 70.7, సిరిసిల్ల 65.0, కోనరావుపేట 85.6 మి.మీ, వీర్నపల్లిలో 57.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

జిల్లాలో అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. హెల్ప్‌లైన్ నంబరు 9398684240ను అందుబాటులో ఉంచారు.

నేడు పాఠశాలలకు సెలవు

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు డీఈవో రమేష్‌కుమార్ తెలిపారు. ఆయా విద్యా సంస్థలు పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

జలమయమైన సిరిసిల్ల

సిరిసిల్ల జిల్లా కేంద్రం జలమయమైంది. సిరిసిల్ల చేనేత చౌక్, సంజీవయ్యనగర్, వెంకంపేట, గణేష్‌నగర్, బీవైనగర్, సర్దార్‌నగర్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో వరద నీరు చేరింది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి వరద ప్రాంతాలను, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి లోతట్టు ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరవావాలన్నారు. ఇళ్లు దెబ్బతిన్న ట్లయితే దగ్గరగా ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఉండ వచ్చన్నారు.

నీటమునిగిన పంటలు

జిల్లాలో భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి, గంభీరావు పేట, ముస్తాబాద్, చందుర్తి, వీర్నపల్లి, కోనరావుపేట, తంగళ్లపల్లి, రుద్రంగి ప్రాంతాల్లో పత్తి, వరి చేన్లలో నీరు చేరింది. పంటలు దెబ్బ తిన్నాయి. వరి నారు కొట్టుకు పోయింది.

కూలిన ఇళ్లు

జిల్లాలో వర్షానికి పాత ఇళ్లు కూలిపోగా, పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇళ్లు కూలిన బాధితులకు తహసీల్దార్లు తక్షణ సాయం కింద ఆర్థిక సాయం అందించారు. ఎల్లారెడ్డిపేటలో సనుగుల లక్ష్మీ ఇల్లు పూర్తిగా కూలిపోయింది. తంగళ్లపల్లి, ముస్తాబాద్, సిరిసిల్ల లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీళ్లు చేరాయి.

స్తంభించిన రాకపోకలు

జిల్లాలో వాగులు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వివిధ గ్రామాల నుంచి రాకపోకలు స్తాంభించిపోయాయి. ఇల్లంతకుంట మండలం తాళ్లపల్లి, గూడెం, గ్రామాల మధ్య రోడ్డు తెగిపోయింది. ముస్తాబాద్ మండలం రామలక్ష్మణులపల్లె, ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామాల మధ్య ఉన్న రోడ్డుపై వరదనీరు పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రుద్రంగి మండలం బడి తండా, దేవుని తండా మధ్య వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. బోయినపల్లి, వేములవాడ మధ్యలో గంజివాగు వర ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిపివేశారు. పలు ప్రాంతాల్లో రాక పోకలను నిలిపివేసి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రాజెక్ట్‌లోకి వరదనీరు

జిల్లాలోని ప్రాజెక్టులలోకి వరదనీరు భారీగా చేరు తోంది. ఎగువ మానేరు ప్రాజెక్ట్‌లోకి 32 ఫీట్లు ఉండగా మత్తడి దూకుతోంది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లోకి 6848 క్యూసెక్కుల వరదనీరు చేరుతుండగా 7075 క్యూసెక్కుల నీటిని దిగువకు వెళ్తోంది. అన్నపూర్ణ ప్రాజెక్ట్‌లోకి 3200 క్యూసెక్కుల నీరు చేరుతుండగా 3300 క్యూసెక్కులు దిగువకు వదిలారు.

వరద పరిస్థితి తెలుసుకున్న కేటీఆర్

సిరిసిల్ల ప్రాంతంలో భారీ వర్షాలతో ఏర్పడ్డ పరిస్థి తులను మాజీ మంత్రి కే తారకరామారావు అడిగి తెలుసుకున్నారు. వర్షపు నీటి ప్రవాహానికి సిరిసిల్ల మున్సిపల్ సిబ్బందికి ఆటంకం లేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. ఆదివారం సిరిసిల్ల పాత బస్టాండ్‌తోపాటు వేములవాడ మండలంలో ఎస్పీ అఖిల్‌మహాజన్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. సంజీవయ్య నగర్ కమాన్ వద్ద నిలిచి ఉన్న వరద నీటిని రోడ్డుపైకి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రవాహం ఎక్కు వగా ఉన్న చోట రవాణా జరగకుండా బారీ కేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఆస్తి, పంట నష్టం తదితర వివరాలు యంత్రాంగానికి తెలపడం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని తెలిపారు. జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

పోలీస్ యంత్రాంగం అప్రమత్తం

భారీ వర్షాల నేపథ్యంలో తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడానికి పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ అఖిల్‌మహాజన్ అప్రమత్తం చేశారు. జిల్లాలోని వరద ప్రాంతాలను పరిశీలించారు. పొంగి పొర్లుతున్న వాగులు, ఒర్రెల వద్దకు ప్రజ లు వెళ్లకుండా భద్రతా చర్యలు చేపట్టారు. వాహనదారులు వెళ్లకుండా ప్లాస్టిక్ కోన్స్, బారీకేడ్లు, హెచ్చరికలు ఏర్పాటు చేయించారు.

వివిధ ప్రాంతాలను పరిశీలించిన ఆది శ్రీనివాస్

జిల్లాలోని కోనరావుపేట, వేములవాడలోని తదితర వరద ప్రాంతాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. వరదనీటితో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచనలు చేశారు. ఆయన వెంట ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తదితరులు ఉన్నారు.


వేములవాడ 13వ వార్డులో వరద నీరు


సిరిసిల్లలో సంజీవయ్యనగర్ రోడ్డును మూసివేసిన పోలీసులు


ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నీట మునిగిన పత్తి


రుద్రంగిలో గొర్రెగుండం గంగ ప్రవాహం


గంభీరావుపేట నర్మాలలో మత్తడి దూకుతున్న ఎగువమానేరు


చందుర్తి మల్యాలలో కల్వర్టు పైనుంచి పారుతున్న వరద నీరు

ఎగువ మానేరుకు జలకళ

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయం జలకల సంతరించుకుంది. మత్తడి మీదుగా పరవళ్లు తొక్కుతోంది. శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగు ఉప్పొంగుతోంది. మరోవైపు సిద్దిపేట జిల్లాలోని గూడవల్లి వాగు కూడా వస్తుండడంతో మానేరు మత్తడి దూకుతోంది. 31 అడుగుల సామర్థ్యం ఉన్న మానేరు పూర్తిగా నిండి ఆదివారం సాయంత్రం మత్తడి దూకింది. ఆదివారం ఉదయం 24 ఫీట్ల వరకు నీరు ఉండగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రాజెక్టుపూర్తిగా నిండింది. పాల్వంచ వాగు స్థాయికి మించి ఉధృతంగా ప్రవహించడంతో మానేరులోకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆదివారం సాయంత్రం వరకు మానేరులోకి 31 అడుగుల నీరు చేరి మత్తడి దూకుతోంది. దీంతో మానేరు ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పర్యాటకుల సందడి మొదలైంది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై రామ్మోహన్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ, సెప్టెంబరు 1 : వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తునా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి ప్రీతి పాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో వినోద్ రెడ్డి నేతృత్వంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.


రుద్ర హోమం నిర్వహిస్తున్న అర్చకులు

● వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రుద్రహోమం నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయం వేళలో తొలుత స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం అనంతరం శ్రావణమాసం ప్రత్యేక పూజల సత్వర ఫలితం కోసం రుద్ర హోమం, పూర్ణాహుతి చేశారు. సాయంత్రం స్వామివారి అద్దాల మండపంలో మహా లింగార్చన నిర్వహించారు. ఆలయ ఈవో వినోద్ రెడ్డి, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండాలని, సేవలు అందించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్‌తో వర్షాల నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించారు. ప్రాజెక్టుల ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో అడిగి తెలుసుకున్నారు. వర్షం, వరదను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షం నేపథ్యంలో అన్ని గ్రామాల్లో చాటింపు వేయించాలని, జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, ప్రజలు బయటికి వెళ్లకూడదని సూచించారు. వరదల కారణంగా రోడ్లు, వంతెనలపై నుంచి వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. వర్షాన్ని అంచనా వేస్తూ విద్యాలయాలకు సెలవులు ప్రకటించాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీపీవో వీర బుచ్చయ్య, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

గంభీరావుపేట, సెప్టెంబరు 1 : గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ -1, కామర్స్ -2 తెలుగు -2, ఇంగ్లీష్ -1 సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 4 సాయంత్రం 4 గంటల లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని తెలిపారు. ఎంపిక ప్రక్రియ గురువారం 5న సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పంటలు దెబ్బతిన్న రైతన్నలను ఆదుకుంటాం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ/కోనరావుపేట, సెప్టెంబర్ 1 : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతాంగాన్ని ఆదుకుంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి ప్రాజెక్టు, వెంకట్రావుపేట, బావుసాయిపేట, మామిడిపల్లిలో మూలవాగు పరిసర ప్రాంతాలను ఏఎస్పీ శేషాద్రినిరెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. విద్యుత్ స్తంభాలను వర్షం పడేటప్పుడు తాకొద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇంటిలో ఉండవద్దని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ప్రభుత్వం శనివారం నుంచే కలెక్టర్లకు, అధికారులకు ఆదేశాలు జారీ చేసిందని అన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కేతిరెడ్డి జగన్‌మోహన్ రెడ్డి, చేపూరి గంగాధర్, చందనగిరి గోపాల్, ఫిరోజ్ పాషా తదితరులు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు.


వరద ఉధృతిని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్

భారీ వర్షాల కారణంగా ముంపునకు గురైన వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని బేడ బుడగ జంగాల కాలనీ, తిప్పాపూర్ సవరాల కాలనీ ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వరదనీటి ముంపునకు గురైన బేడ బుడగ జంగాల కాలనీవాసులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ సంపత్ రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వరద నీరు ప్రవహించే రోడ్లపై ప్రయాణం వద్దు

సిరిసిల్ల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వరదనీరు ప్రవహించే రోడ్లపై ప్రయాణాలు చేయవద్దని, రాకపోకలు సాగించవద్దని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సూచించారు. ఆదివారం జిల్లాలోని కోనరావుపేట మండలం నిమ్మపల్లి, మరిమడ్ల, నిజామాబాద్, మామిడిపల్లి, చందుర్తి మండలం మూడపల్లి, మల్యాల గ్రామాల్లో రహదారుల పైనుంచి ప్రవహిస్తున్న వాగులను ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి పరిశీలించారు. వరద ప్రవాహంపై కలెక్టర్ చర్చించారు. రహదారులపై వరదనీరు ఉన్న ప్రాంతాల్లో బారీ కేడ్లు ఏర్పాటు చేయాలని, వాచర్లను నియమించాలని అన్నారు. కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం 9398684240 నంబరులో సంప్రదిం చాల న్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ ఉన్నారు.

తహసీల్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూంలు

భారీ వర్షాల కారణంగా అన్ని తహసీల్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు.


సూచనలు ఇస్తున్న కలెక్టర్

ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూంల ద్వారా తెలియజేయాలన్నారు. బోయినపల్లి 9701338055, చందుర్తి 9866920083, ఇల్లంతకుంట 99854 37929, గంభీరావుపేట 9703332192, కోనరావుపేట 9490542412, 9652117683, ముస్తాబాద్ 95051 74172, రుద్రంగి 8309472948, సిరిసిల్ల 99081 16490, తంగళ్లపల్లి 9963453922, వేములవాడ 8723238767, వేములవాడ రూరల్ 8179987985, వీర్నపల్లి 9014054047, ఎల్లారెడ్డిపేట 8121233676, 9948372219, 8107420281 నంబర్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 1: హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆదివారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ ఆరోపణలు చేయడం దురదృష్టకరమన్నారు. అమలుకు నోచుకోని హామీలనిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఏ గ్రామంలోనైనా రుణమాఫీ పూర్తిస్థాయిలో జరిగిందా చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకులను నిలదీశారు. దమ్ముంటే ధరణిని రద్దు చేయాలని సవాల్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

జ్వరంతో మహిళ మృతి

ముత్తారం, సెప్టెంబరు 1: మండల కేంద్రానికి చెందిన మామిడి శ్రీలత (45) జ్వరంతో మృతిచెందింది. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్న శ్రీలతను హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందినట్లు భర్త శ్రీనివాస్ తెలిపారు. ఆమెకు భర్త, కొడుకు కూతురు ఉన్నారు.

శ్రీలత(ఫైల్)

విద్యుదాఘాతంతో వృద్ధురాలు..

రామగిరి, సెప్టెంబరు 1: మండలంలోని రాజాపూర్ గ్రామంలో విద్యుదాఘతంతో అంకం రాజమ్మ(65) అనే వృద్ధురాలు మృతిచెందింది. ఆదివారం ఉదయం 9.00 గంటల ప్రాంతంలో ఇంటి ఎదుట రేకుల షెడ్డులో బట్టలు ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి ముగ్గురు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి పెద్దకొడుకు సదానందం ఫిర్యాదు మేరకు ఎస్సై చంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: మనీ యాప్‌లు వేధించడంతో కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన తుండ్ల శ్రీనివాస్(30) ఇటీవల పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు మృతుని కుటుంబ సభ్యులు తెలిపారు. శ్రీనివాస్ అవివాహితుడు.

ఇద్దరిపై పిచ్చికుక్క దాడి

చందుర్తి, సెప్టెంబరు 1: చందుర్తి మండలం మూడపెల్లి గ్రామంలో ఆది వారం ఇద్దరు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన బద్దం మల్లారెడ్డి, మధు బస్టాండ్ వద్ద ఉన్నారు. అటువైపు వచ్చిన ఓ పిచ్చికుక్క ఇద్దరిపై దాడి చేసి గాయపరిచింది. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఆస్పత్రికి తరలించారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

మానకొండూర్, సెప్టెంబరు 1: మండలంలోని ఖాదర్‌గూడెం గ్రామానికి గౌడ శంకర్ (54) అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గౌడ శంకర్ ఒంటరి జీవితం గడపడమే కాకుండా అనారోగ్యానికి గురి అయ్యాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆదివారం ఇంటిలోని ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

దొంగతనానికి పాల్పడిన వ్యక్తి పట్టివేత

భగత్‌నగర్, సెప్టెంబర్ 1: కరీంనగర్-2 డిపో బస్సు నెం.టిఎస్ 02 యుసి6250లో కండక్టర్ బ్యాగును దొంగిలించిన బి.రమేష్ అనే వ్యక్తిని ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పట్టుకుని వన్ టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ లక్‌పతి, సెక్యూరిటీ గార్డ్ జి కవిత, ఆన్‌డ్యూటి కంట్రోలర్ ఐసిఎస్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు జలకళ

ఉమ్మడి జిల్లాలో శనివారం రాత్రి నుంచి జోరు వర్షం కురిసింది. దీంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. వరద పోటెత్తడంతో అధికారులు ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. చెరువులు, కుంటలు మత్తడి పడుతున్నాయి. వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సూచిస్తున్నారు.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద నీరు


జగిత్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోంది. ఎస్సారెస్పీలోకి 83,636 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 64.768టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 2,325 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

● వరద కాలువకు నీటి విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో ఆదివారం సాయంత్రం వరద కాలువకు నీటిని వదిలారు. హెడ్ రెగ్యులేటర్ గేట్లను ఎత్తి వరద కాలువ దిగువకు 1,500 క్యూసెక్కుల నీటిని అధికారులు వదిలారు. కాగా నిజామాబాద్, నిర్మల్ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద నీరు వస్తోందని, గోదావరి నదీ పరిసరాల ప్రాంతాల్లోని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సారెస్పీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా చేపలు పట్టేవారు, రైతులు, పశువుల కాపరులు నదిలోకి దిగవద్దని కోరారు. అధికారుల సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

మిడ్ మానేరుకు వరద ఉధృతి

బోయినపల్లి, సెప్టెంబరు 1: శ్రీ రాజరాజేశ్వర (మిడ్ మానేరు) ప్రాజెక్టులోకి ఎగువ భాగాన కురిసిన వర్షంతో మానేరు, మూల వాగు ద్వారా భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులోకి 46,891 క్యూసెక్కుల నీరు చేరుతోంది. 6,550 క్యూసెక్కుల నీటిని బయటకు వదలుతున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 16.215 టీఎంసీల మేరకు ఉంది. కాగా తుఫాన్ ప్రభావం వల్ల ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరిగితే ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు కింద ఉన్న మానేరు పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.


మిడ్ మానేరు ప్రాజెక్ట్

ఎల్ఎండీకి పెరిగిన ఇన్‌ఫ్లో


నీటితో కళకళలాడుతున్న దిగువ మానేరు జలాశయం

తిమ్మాపూర్, సెప్టెంబరు1: ఎడతేరపి లేకుండా కురుస్తున్న భారి వర్షాల కారణంగా కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. శనివారం రాత్రి 9గంటల సమయం వరకు ఎల్ఎండిలోని మోయతుమ్మెద వాగు నుండి కేవలం 1100 క్యూసెక్కు నీరు రాగా, ఆదివారం ఉదయం 6గంటల సమయంలో 2,716 క్యూసెక్కులకు, 9గంటలకు 12,206క్యూసెక్కులకు, మధ్యాహ్నం 2గంటల ప్రాంతములో 15,595, 3గంటలకు 29,879, సాయం త్రం 5గంటలకు 39,047 క్యూసెక్కులకు పెరిగింది. రాత్రి తొమ్మిదిగంటలకు 15,937 క్యూసెక్కులకు తగ్గింది. ప్రా జె క్టులోకి మొత్తం ఇన్‌ఫ్లో 18,320 క్యూసెక్కులు ఉంది. ఎల్ ఎండీ పూర్తి స్థాయి స్థామర్థ్యం 24.034 టీఎంసీలకు కాగా ప్ర స్తుతం 14.76 టీఎంసీల నీరు నిల్వ ఉంది. శ్రీరాజరాజేశ్వర మిడ్ మానేరు రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను అధికా రులు నిలిపివేశారు.


ఎల్లంపల్లి నుంచి దిగువ గోదావరిలోకి వదులుతున్న నీరు

శ్రీపాద ఎల్లంపల్లి గేట్లు ఎత్తిన అధికారులు

పెద్దపల్లి/ధర్మారం/అంతర్గాం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఆదివారం తెల్లవారుజాము వరకు పెద్ద ఎత్తున వరద నీరొచ్చి చేరింది. క్యాచ్ మెంట్ ఏరియా, కడెం ప్రాజెక్టు నుంచి 1,15,074క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా,20 గేట్లు ఎత్తి 1,15,074 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలి పెడుతు న్నారు. దీంతో గోదావరి తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మరోవైపు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. వరద ప్రవాహాన్ని బట్టి నీటిపారుదల శాఖ అధికారులు గేట్లు ఎత్తుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 20. 175 టీఎంసీలు కాగా ప్రస్తుతం 17,813 టీఎంసీల నీరు ఉంది. గోదావరి తీర ప్రాంత గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లకుండా అధికారులు నిషేదాజ్ఞలు జారీ చేశారు.

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	83.636	2.325	80.5	64.768
ఎల్లంపల్లి	1,15.074	1.15.074	20.175	17.813
మిడ్ మానేరు	46,891	6.550	27.54	16.215
ఎల్ఎండీ	18.320	267	24.034	14.376
ఎగువమానేరు	27,500	------	2.00	2.00

నక్కలవాగులో కొట్టుకుపోయి ఉద్యోగి మృతి


పవన్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: నక్కలవాగులో కొట్టుకుపోయి ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన మండలంలోని మీర్జంపేట గ్రామ పరిధిలోని కొత్తపల్లిలో చోటుచేసుకుంది. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన చెప్యాల పవన్(22) మీర్జంపేట గ్రామ పంచాయతీలో కారోబార్‌గా పనిచేస్తున్నాడు. వార్డుల విభజన సందర్భంగా ఆదివారం ఉద్యోగరీత్యా మీర్జంపేట గ్రామానికి వెళ్లి విధులు నిర్వహించి సాయంత్రం తన స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్‌కు మోటార్ సైకిల్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులోని నక్కలవాగు రోడ్డుపై పొంగి ప్రవహించడంతో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంతో సహా పవన్ నీటిలో కొట్టుకుపోయాడు. పోలీసులు, కాల్వ శ్రీరాంపూర్‌కు చెందిన గ్రామస్తులు పవన్ కోసం వాగులో గాలింపులు చేపట్టారు.సంఘటన స్థలానికి వంద మీటర్ల దూరంలో పొదల్లో చిక్కుకుని ఉన్న పవన్ మృతదేహాన్ని రాత్రి పది గంటల ప్రాంతాంలో స్థానికులు గుర్తించారు. చెప్యాల పవన్ తండ్రి చెప్యాల సదయ్య గ్రామ కార్యదర్శిగా పని చేసి అనారోగ్యంతో మృతి చెందడంతో నాలుగు సంవత్సరాల క్రితం పవన్‌కు మీర్జంపేట గ్రామంలో కారోబార్‌గా ఉద్యోగం వచ్చింది. పవన్ గల్లంత కావడంతో అతని తల్లి స్వరూపతో పాటు కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

కూనారం చెరువులో మత్స్యకారుడి గల్లంతు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 1: కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కూనారం చెరువులో పడి మత్స్యకారుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం బేతికల్ గ్రామానికి చెందిన గోస్కుల కుమార్(45) మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చేతి ధర్మయ్య వద్ద పని చేస్తున్నాడు. కునారం పెద్ద చెరువును చేతి ధర్మయ్య లీజుకు తీసుకొని చేపలు వేశాడు. ఆదివారం చేతి ధర్మయ్య దగ్గర పనిచేసే నలుగురు మత్స్యకారులు కునారం పెద్ద చెరువు మత్తడి వద్ద చేపలు బయటికి వెళ్లకుండా వలలు కడుతుండగా ప్రమాదవశాత్తు గోస్కుల కుమార్ చెరువులో పడి గల్లంతయ్యాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మానేరులో మత్స్య కార్మికుడు..

గంభీరావుపేట, సెప్టెంబరు 1: రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల మానేరు ప్రాజెక్టు జలాశయంలో మాచారెడ్డి మండలం లచ్చపేటకు చెందిన శివరాములు అనే మత్స్య కార్మికుడు గల్లంతయ్యాడు. శివ రాములు ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు ఇంటి నుంచి వెళ్లాడు. లచ్చపేట సమీపాన ప్రవహించే మానేరులోకి వచ్చే పాల్వంచ వాగులో శివరాములు చేపలు పట్టేందుకు వెళ్లినట్టు గ్రామస్థులు తెలిపారు. లచ్చపేట వాగు వద్ద శివ రాములు దుస్తులు, పాదరక్షలు లభించడంతో చేపలు పట్టే క్రమంలో గల్లంతయ్యినట్టు గ్రామస్థులు భావిస్తున్నారు.

చెరువు నీటిలోకి వెళ్లి విద్యుత్ లైన్ల మరమ్మతులు


మరమ్మతులు చేస్తున్న అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్

రామడుగు, సెప్టెంబరు 1: భారీ వర్షాలతో రామడుగు మండల కేంద్రానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ నడుములోతు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లి చెరువులో ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. శనివారం రాత్రి నుంచి రామడుగులో భారీ వర్షం కురుస్తోంది. గ్రామానికి వచ్చే విద్యుత్ లైన్‌కు సంబంధించిన కొన్ని స్తంభాలు చెరువు సమీపంలో ఉన్నాయి. భారీ వర్షాలకు ఆ స్తంభాల చుట్టూ చెరువు నీరు చేరింది. అందులో ఓ స్తంభం వద్ద లైన్ సాంకేతిక ఇబ్బంది ఏర్పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాల మేరకు అసిస్టెంట్ లైన్‌మన్ రంజిత్ భారీ వర్షం కురుస్తున్నా నడుములోతు నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి స్తంభం ఎక్కి లైన్‌ను సరి చేశాడు. దీంతో గ్రామానికి విద్యుత్ వచ్చింది. రంజిత్‌ను గ్రామస్థులు, అధికారులు అభినందించారు.

కూలిన రామడుగు బ్రిడ్జి


అధికారులతో కలిసి బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, సెప్టెంబరు 1: శిథిలావస్థకు చేరిన రామడుగు బ్రిడ్జి వరద ప్రవాహానికి ఆదివారం కూలిపోయింది.. స్థానిక అధికారులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాకపోకలను నియంత్రించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో అక్కడికి చేరుకుని బ్రిడ్జిని పరిశీలించారు.. నూతన బ్రిడ్జిలో భూములు కోల్పోయిన వారికి తక్షణమే పరిహారం అందించి త్వరలో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.. అప్పటివరకు రాకపోకలకు తాత్కాలికంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశాలు జారీ చేశారు. బ్రిడ్జి తెగిపోయిన నేపథ్యంలో ఇటువైపు రావొద్దని ఎస్సై సురేందర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

భారీ వర్షాలతో తిరుపతి రైలు రద్దు


వెలవెలబోతున్న కరీంనగర్‌రైల్వే స్టేషన్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 1: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు కరీంనగర్ నుంచి తిరుపతి వెళ్లే రైలును అధికారులు రద్దు చేశారు. శనివారం రాత్రి తిరుపతి నుంచి కరీంనగర్ బయలుదేరిన రైలు తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు విజయవాడ సమీపంలో నిలిపి వేశారు. ఆదివారం రాత్రి కరీంనగర్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరాల్సిన రైలును రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు రద్దుపై సరైన సమాచారం లేదని, రైల్వే అధికారులు నిర్లక్ష్యమైన సమాధానం ఇస్తున్నారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ధర్మపురి వద్ద ప్రమాద స్థాయిలో గోదావరి వరద


ధర్మపురి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ధర్మపురి, సెప్టెంబరు 1: ధర్మపురి వద్ద గోదావరి నది వరద ఆదివారం సాయంత్రం ప్రమాద స్థాయికి చేరింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు అనేక గ్రామాల్లో వాగులు, చెరువులు, కుంటలు నిండి పోయాయి. దీనికి తోడుగా నిర్మల్ జిల్లా కడెం-నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరింది. ఉదయం ఏడు గంటల వరకు ప్రాజెక్టు లోనికి 65,130 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగింది. దీంతో ప్రాజెక్టు సంబంధించిన 10 గేట్లు తెరచి 79,166 క్యూసెక్కుల నీరు దిగువ గోదావరి నదిలోకి అధికారులు విడుదల చేశారు. దీంతో గోదావరి నీటి మట్టం క్షణక్షణం పెరిగి వేగంగా ప్రవాహం కొనసాగింది. సాయంత్రం ఐదు గంటల వరకు కడెం ప్రాజెక్టులోకి 32,168 ఇన్‌ఫ్లో కొనసాగడం వల్ల కొంత మేరకు నీరు తగ్గించారు. దిగువ గోదావరి నదిలోకి 18,522 క్యూసెక్కులు విడుదల చేశారు. సత్యవతి, బ్రహ్మగుండం పైనుంచి వేగంగా నీటి ప్రవాహం కొనసాగడం వల్ల చిన్నగద్దె, మంచి నీటి బావి నీటిలో మునిగిపోయింది. భక్తులను లోతు ప్రదేశాలకు వెళ్లి స్నానాలు చేయకుండా ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది అప్రమత్తం చేశారు. నదీ తీరాన గల ఆరెపల్లి, దొంతాపూర్, జైనా, రాజారం, గోదావరి వరద వల్ల ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తమై జాగ్రత్తగా ఉండాలన్నారు. . కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి సహాయక చర్యల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

▸▸ క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలి ▸▸ మంత్రి పొన్నం ప్రభాకర్


మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. వర్షాల నేప థ్యంలో ఆదివారం ఉదయం కరీంనగర్ కార్యాల యం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తూ అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూమ్ ద్వారా వచ్చిన ఫిర్యా దులకు వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. పురాతన, శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అక్కడి నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు పంపించాలన్నారు. మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలుంటాయన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా స త్పతి, జిల్లా అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షి స్తూ ప్రాజెక్టుల నీటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సంజిత్‌కు మార్ ఝా, ఎస్పీ అఖిలేష్ మహాజన్‌తో ఎప్పటి కప్పుడు సమీక్షించారు. మిడ్‌మానేరుకు వస్తున్న వరద, ఎగువ మానేరు పరిస్థితిని అడిగి తెలుసుకు న్నారు.

ఎంజేపీ గురుకులంలో విద్యార్థుల ఆందోళన

-మాడిన అన్నం పెట్టారని సాయంత్రం వరకు పస్తులు

-ప్రిన్సిపాల్ ఆదేశాలతో మళ్లీ వండిపెట్టిన నిర్వాహకులు

సైదాపూర్, సెప్టెంబరు 1: సైదాపూర్ మహాత్మాజ్యోతిరావు పూలే (బాలుర) గురుకుల పాఠశాలలో ఆదివారం మధ్యాహ్నం మాడిన అన్నం పెట్టారని విద్యార్థులు ఆందోళన చేశారు. ఆదివారం అన్నం మెత్తగా వండడంతో పాటు మాడిపోవడంతో విద్యార్థులు అన్నం తినకుండా సాయంత్రం వరకు ఉన్నారు. 9,10వ తరగతి, ఇంటర్ విద్యార్థులు ఆందోళన చేయడంతో ప్రిన్సిపాల్ ఆదేశాలతో వంటల నిర్వాహకులు మళ్లీ అన్నం వండి పెట్టారు. దాంతో సాయంత్రం అన్నం తినాల్సి వచ్చిందని విద్యార్థులు తెలిపారు. దీనిపై సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా మూడు గంజుల్లో అన్నం వండగా ఒక గంజులో మాడిపోయిన మాట వాస్తవమేనన్నారు. వంటవారిని మందలించి మళ్లీ వండి విద్యార్థులకు పెట్టామన్నారు. చాలా రోజుల నుంచి గిన్నెలు కారుతున్నాయని వంటవారు చెప్పారని, ఆ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని తెలిపారు. కాగా సైదాపూర్‌లో సరైన భవనం లేకపోవడంతో సైదాపూర్ ఎంజేపీ గురుకుల పాఠశాలను హుజూ రాబాద్‌లోని బోర్నపల్లి వద్ద బిల్డింగ్ కిరాయికి తీసుకొని నిర్వహిస్తున్నారు. ఆ బిల్డింగ్‌కు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి


యూఎస్ఎఫ్ఐలో చేరిన వారికి కండువా కప్పుతున్న నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 1: ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో ఉద్యమాలు నిర్వహిస్తామని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సంద గణేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి తిరుపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడు మాసాలు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయి విద్యా శాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమని మండి పడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమిం చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాక ముందు యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తామని చెప్పి హామీలను విస్మరించారన్నారు. తక్షణమే ప్రభుత్వ విద్యాలయా లను సందర్శించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు పెరిగిన ధరలకు అనుగుణంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలన్నారు. అనంతరం ఉత్తర తెలంగాణకు సంబంధించిన వివిధ విద్యార్థి సంఘం నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన నాయకులు యుఎస్ఎఫ్ఐ సంఘంలో చేరారు. వారికి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కండువా కప్పి ఆహ్వానించారు. సమావేశంలో పెద్దపల్లి జిల్లా మాజీ నాయకుడు రామగల సురేష్ చేరారు. కరీంనగర్ జిల్లాలో ఉమామహేశ్వర్, మయూరి, అక్షయలతో పాటు ఇతరులు చేరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు బి తిరుపతి కుమార్. జిల్లా నాయకులు సంతోష్, మల్లికార్జున, సతీష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీ వర్షం


పెద్దపల్లి జిల్లా పెద్దబొంకూరులో ఇంట్లోకి వెళ్లిన వర్షపు నీరు


వరదతో నిండిపోయిన ఫైవింక్లయిన్ రహదారి


కోరుట్లలోని ప్రకాశం రోడ్డులో నిలిచిన వరదనీరు


సైదాపూర్‌లో లోలెవల్ వంతెనపై చిక్కుకున్న ఆటోను తీస్తున్న ప్రజలు


అలుగు పారుతున్న కొత్తపల్లి చెరువు


చిగురుమామిడి మండలంలో ఇంట్లోకి చేరిన వరదనీరు


మత్తడి దూకుతున్న సర్వాయిపేట కొచ్చెరువు

ఉప్పొంగిన వాగులు.. నిలిచిన రాకపోకలు

- ఎడతెరిపి లేని వర్షం
- వేములవాడలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- పలు ప్రాంతాలను పరిశీలించిన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి ఎల్లారెడ్డిపేట మండలం ఆదివారం జలమయమైంది. వాగులు ప్రవహించి చెరువులు మత్తడి దూకాయి. పదిర- రామలక్ష్మణపల్లి, కోరుట్లపేట, అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా శివారుల్లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రంతోపాటు రాచర్లబొప్పాపూర్, పదిర, నారాయణపూర్, బుగ్గరాజేశ్వరతండా, బండలింగంపల్లిలో ఇళ్లు, పశువుల పాకలు కూలిపోయాయి. సుమారు రూ.20 లక్షల నష్టంవాటిల్లిందని బాధితులు తెలిపారు. రహదారులన్నీ జలమయమయ్యాయి. చెరువులు నిండుకుండలా మారాయి. గిద్దె చెరువు, ఊర చెరువు మత్తడి దూకుతున్నాయి. సుమారు 300 ఎకరాల్లో పత్తి, 200 ఎకరాల్లో వరి చేనులు నీట మునిగాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సెస్ సిబ్బంది వర్షంలోనూ మరమ్మతు చేసి పునరుద్ధ రించారు. తహసీల్దార్ రామచంద్రం, సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ముందస్తు చర్యలు చేపట్టారు.

ఇల్లంతకుంట: భారీ వర్షాలతో మండలంలోని అన్ని గ్రామాలలోని కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. పత్తికుంటపల్లె చెరువకు వరదనీరు పెరగడంతో మత్తడి దూకడంతో తాళ్ళపెల్లి, గూడెం మధ్య రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బిక్కవాగు ఉధృతికి జవారిపేట, నర్సక్కపేట మధ్య రోడ్డు కొట్టుకుపోయింది. వల్లంపట్లలో లోతుకుంట మత్తడిపై, తిప్పాపూర్ సమీపంలోని కాజ్‌వే పైనుంచి నీరు ప్రవహిస్తోంది. కందికట్కూర్‌లో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో సహాయక చర్యలను ఆర్డీవో రమేష్, తహసీల్దార్ ఫారూక్, ఎంపీడీవో శశికళ, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఆర్ఐ షఫీలు పరిశీలించారు. అనంతారంలో బట్టి నర్సయ్యకు చెందిన ఇల్లు కూలింది. రేపాక మసీదు ప్రహరీ కూలింది. ఇల్లంతకుంటలో బస్టాండు ప్రాంతంలోకి నీరు ఎక్కువగా రావడంతో దూకాణాల్లోకి చేరింది. పెద్దలింగాపూర్ సమీపంలోని రైతులు వరదనీరు రాకుండా ఇటీ వల లక్షల రూపాయలతో మట్టిపోసుకోగా నీటి ప్రవహానికి కొట్టుకుపోయింది. భారీవర్షాల దృష్ట్యా ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని ఇళ్లదాటి బటయకు రావద్దని మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, కాంగ్రె స్ మండల అధ్యక్షుడ రాఘవరెడ్డి, అధికారులు వేర్వేరు ప్రకటనల్లో సూచించారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలో లోతట్టు ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు చేరింది. వాగులు వంకలు పొంగి పోర్లాయి. జిల్లెల్ల- చిన్నలింగాపూర్ మధ్య ప్రధాన రోడ్డులోని కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకాలు నిలిచిపోయాయి. డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ఎస్సై సుధాకర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. మండేపల్లిలో చెక్కపెల్లి చంద్రయ్యకు చెందిన పెంకుటిళ్లు వర్షానికి కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. భారీ వర్షానికి తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లె శివారులోని గుట్టల పైనుంచి జాలువారుతున్న మినీవాటర్‌ఫాల్ సందర్శకులను ఆకర్షిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి గుట్టల పైనుంచి కిందకు నీరు ప్రవహిస్తోంది.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రానికి సమీపాన పెద్ద కాల్వ కట్ట తెగి నీళ్లు వృథాగా పోయాయి. వరద నీరు పెద్ద కాలువ ద్వారా సింగ సముద్రానికి వెళ్తుంది. పైన కురిసిన భారీ వర్షాలకు పెద్ద కాలువ ప్రవహించింది. ఆదివారం పెద్ద కాల్వ కట్ట తెగడంతో నీరు మానేరు వాగులోకి వెళ్లింది. దీంతో మధ్యలో ఉన్న పంటలకు నష్టం వాటిల్లింది. కొందరు నాయకులు సమీప రైతులు చెట్ల కొమ్మలను, గడ్డి, మొరం పోసి తాత్కాలికంగా నీరు వృథా పోకుండా కట్టడి చేశారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలో వాన దంచి కొట్టడంతో వాగులు పొంగిపొర్లాయి. మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు, అడవిపదిర ధర్మారపు చెరువు, వన్‌పల్లి హన్మాజి చెరువు, రంగంపేట జంపన్న చెరువులు నిండుకుండలా మారి మత్తడి దుంకాయి. భారీ వర్షాలకు మూలవాగు శాంతినగర్, గర్జనపల్లి వంతెనలకు ఆనుకొని ఉధృతంగా ప్రవహించింది. రాయిని చెరువు మత్తడి దుంకడంతో మద్దిమల్ల, బంజేరు, కాశీతండా గ్రామాలకు, వన్‌పల్లికి వెళ్లే దారిలో వట్టివాగు ఉధృతంగా ప్రవహించింది. రాకపోకలు నిలిచిపోయాయి. ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీవో రఘురాం ఆయా గ్రామాలలో వంతెనల వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. పలు గ్రామాల్లో లోలెవెల్ వంతెనల పైనుంచి నీరు ప్రవహించడంతో దారులను మూసి వేయించారు. గర్జనపల్లి గ్రామంలో భారీ వర్షానికి మల్యాల పూజిత ఇల్లు పాక్షికంగా కూలిపోవడంతో వెంటనే తహసీల్దార్, ఎంపీడీవో అక్కడికి చేరుకొని ఆ కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించారు. రూ. 3200 సహాయాన్ని అందించారు.

వేములవాడలో..

వేములవాడ: దంచి కొడుతున్న వానలతో వేములవాడ పట్టణంలో పలు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకున్నాయి. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా కొనసాగడంతో ఆదివారం తెల్లవారేసరికి వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కొనాయిపల్లి శివారులో గల 13వ వార్డులో ఉన్న బేడ బుడిగే జంగాల కాలనీలోకి వరదనీరు వచ్చి చేరింది. ఈ కాలనీలోని పూరి గుడిసెలు, ఇళ్లు నీటి ముంపుకు గురయ్యాయి. పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ ప్రాంతం తో పాటు మున్నూరు కాపు సత్రం ఏరియాలోను పలు ఇండ్లలో వరద నీరు వచ్చి చేరింది. కాలనీని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రెవెన్యూ, మున్సిపల్, పోలీసు విభాగాల అధికారులతో సందర్శించారు. నిరాశ్రయులుగా మారిన వారిని తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. మున్సిపల్ రెవెన్యూ, అధికారులు వారిని కోనాయిపల్లి శివారులోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లోకి తాత్కాలికంగా తరలించి వారికి భోజన వసతి కల్పించారు. వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, వేములవాడ అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి, తహసీల్దార్ మహేష్ కుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి, పట్టణ సీఐ వీరప్రసాద్ తదితరులు పునరావాస ఏర్పాట్లు పరిశీలించారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని తిప్పాపూర్‌లో ఓ పెంకుటిల్లు కూలిపోయింది. కూలిపోయిన ఇంటిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఇంటి యజమానిని ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మూల వాగులో ప్రవాహం పెరిగింది. స్థానిక బతుకమ్మ తెప్ప వద్ద మూల వాగు ప్రవాహాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులు పరిశీలించారు.

● ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టు నుంచి భారీ ఎత్తున వరద నీరు వస్తుండడంతో వేములవాడ వద్ద మూలవాగు ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. గత నెలలో కురిసిన వర్షాలకు మూలవాగులో ప్రవాహం ప్రారంభమవగా ఒకటి రెండు రోజుల్లోనే ప్రవాహం దాదాపుగా నిలిచిపోయింది. మూలవాగులో పలుచోట్ల ఉన్న చెక్ డ్యాముల వద్ద ఇప్పటికే నీటి నిల్వలు సంపూర్ణంగా ఉండగా, తాజా వర్షాలతో నక్కవాగు నుంచి సైతం వర్షపు నీరు వచ్చి చేరడంతో మూలవాగు ప్రవాహం పెరిగింది.

వేములవాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట నక్కవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తికాక పోవడంతో తాత్కా లికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు పూర్తిగా కొట్టుకు పోయింది. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ హన్మాజీపేట నక్కవాగు ప్రవా హాన్ని పరిశీలించారు. వాగు ప్రవాహం తీవ్రంగా ఉన్నందున రోడ్డు దాటడానికి సాహసం చేయొద్దని కలెక్టర్, ఎస్పీ సూచించారు. మల్లారం మూలవాగు మత్తడి దుంకుతోంది.

చందుర్తి: భారీ వర్షాలకు చందుర్తి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మూడపెల్లి ఊర చెరువు మత్తడి దూకడంతో బస్టాండ్ నుంచి గ్రామానికి వెళ్లే కల్వర్టు పై నుంచి నీరు ప్రవహించి రాకపోకలు నిలిచిపోయాయి. మర్రిగడ్డలోని కొమటి చెరువు నుంచి నీరు కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిపై ప్రవహించింది. చందుర్తి మండల కేంద్రంలోని అవుసుల వాగు నీరు ప్రధాన రహదారిపై ప్రవహించింది. మల్యాల వెంగళ చెరువు మత్తడి దూకింది. కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి కల్వర్టు పైనుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కొత్తపేటకు వెళ్లే దారిలోని ఒర్రె ప్రవహించడంతో గ్రామానికి ఇతర గ్రామాలతో సంబంధాలు తెగిపోయాయి. రామన్నపేట శివారులోని లొడి చెరువు మత్తడి దూకడంతో చందుర్తి నుంచి రామన్నపేట, తిమ్మాపూర్, ఆశిరెడ్డిపల్లి, అనంతపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కట్టలింగంపేట గ్రామంలో మిరుపాల ఎల్లవ్వ ఇంటిపై చెట్టు విరిగి పడింది. జోగాపూర్ శివారులోని ఎల్లమ్మ ఆలయం సమీపంలో కల్వర్టు పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. మరిగడ్డ నుంచి జోగాపూర్. కిష్టంపేట. రామారావుపల్లి, సనుగుల, దేవుని తండాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బోయినపల్లి: బోయినపల్లి వేములవాడ మధ్య గంజివాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాత్కాలికంగా పోసిన రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకు పోయింది. బోయినపల్లి నుంచి కొదురుపాకకు వెళ్లే వంతెన పైనుంచి వర్షపు నీరు వెళ్లడంతో రాకపోకలను నిలిపివేశారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్ ఎంపీడీవో జయశీల ఎస్సై పృథ్వీదర్ గౌడ్ పరిశీలించారు.

కోనరావుపేట: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని మరిమడ్ల గ్రామంలో ఓ ఇల్లు కూలింది. గ్రామానికి చెందిన శనిగారపు లచ్చవ్వకు చెందిన ఇంటి ముందు భాగం కూలడంతో పక్కింట్లో ఉంటోంది.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలోని గోలెపులొద్ది చెరువు, అచ్చయ్యకుంట చెరువు, బతుకమ్మ చెరువు మత్తడి దూకుతున్నాయి. రుద్రంగి శివారులో కోచ్చగుట్ట తండా ఒర్రె బ్రిడ్జి వద్ద చెత్త చేరడంతో పోలీసులు ఎక్స్‌కావేటర్‌తో తొలగించారు. దసరా నాయక్ తండాకు వెళ్లే రోడ్డులో బ్రిడ్జి కోతకు గురైంది. రుద్రంగిలోని కోరుట్ల - వేములవాడ ప్రధాన రహదారిలో నందివాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగడంతో బారికేడ్లు ఏర్పాటు చేశారు. మానాలలోని కోమటి చెరువు మత్తడి దూకడంతో గ్రామ శివారులో రుద్రంగి-మానాల రోడ్డు పైనుంచి తాతమ్మవాగు ఉధృతంగా ప్రహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పంటలు నీట మునిగాయి.

● రుద్రంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కాలనీలో గుట్ట ప్రాంతం నుంచి కొండ చిలువ జనావాసాల్లోకి రావడంతో కొట్టి చంపేశారు.


ఇల్లంతకుంట మండలం అనంతారం వాగు ప్రవాహం


ఎల్లారెడ్డిపేటలో వరదనీటికి కొట్టుకుపోయిన జవారిపేట రోడ్డు


మద్దిమల్ల కాశితండాలో తాడు సాయంతో రోడ్డు దాటుతున్న గిరిజనుడు


మల్లారంలో మత్తడి దుంకుతున్న మూలవాగు


ఇల్లంతకుంటలో నీట మునిగిన వరి


తంగళ్లపల్లిలో ఇంట్లోకి నీరు చేరడంతో సామగ్రి తీసుకెళ్తున్న బాధితుడు


జిల్లెల్ల-చిన్నలింగాపూర్ మధ్య కల్వర్టు వద్ద పర్యవేక్షిస్తున్న డీఎస్పీ


ముంపు బాధితులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి


బోయినపల్లిలో నిలిచిపోయిన రాకపోకలు

నేడు ప్రజావాణి రద్దు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ప్రజావాణి రద్దు చేసినట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు. భారీ వర్షాలు కురుస్తున్నాయని జాలర్లు చేపల వేటకు వెళ్లవద్దని, నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న రోడ్లు, వంతెనలపై నుంచి వాహనదారులు వెళ్లకూడదని సూచించారు. ఆయా శాఖల అధికారులు అందరూ స్థానికంగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో సిరిసిల్ల పట్టణ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ విలేకరులతో మాట్లాడారు. వర్షాలతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, పట్టణ ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలోగానీ, గోడల వెంటగానీ ఎవరూ ఉండవద్దన్నారు. లోతట్టు ప్రాంతాలైన శాంతినగర్, శ్రీనగర్‌కాలనీ, రాజీవ్‌నగర్, పద్మనగర్, వెంకంపేట, సంజీవయ్యనగర్ ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంబాలకు దూరంగా ఉండాలని, మెరుపులు, ఉరుములు వచ్చే క్రమంలో చెట్ల కింద, విద్యాత్ స్తంభాల వద్ద, సెల్ టవర్ల వద్ద ఉండవద్దని అన్నారు. వర్షం, వరద ప్రవాహం తగ్గే వరకు రోడ్లపైకి రావద్దని సూచించారు. సమస్యలు ఉంటే వార్డు కౌన్సిలర్ల దృష్టికి తీసుకురావాలని, సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. వర్షంతో ఇళ్లు దెబ్బతిన్న వారు దగ్గరలోని కమ్యూనిటీ హాల్‌లో ఉండవచ్చన్నారు. పట్టణంలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా మున్సిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ పరంగా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.87 టీఎంసీల నీరు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 1: ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.87 టీఎంసీలకు చేరుకుంది. మధ్యమానేరు ద్వారా 6400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా 300 క్యూసెక్కుల వర్షపు నీరు చేరుతోంది. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

కేక్ కట్ చేసిన టీడీపీ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1: నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 29 సంవత్సరాలు పూర్తి చేసుకొని 30 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆదివారం టీడీపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణం టీడీపీ కార్యాలయంలో ఆదివారం పట్టణ కార్యవర్గం సమావేశం నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్ మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు తొలిసారిగా ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి 29 సంవత్సరాలు పూర్తి చేసుకొని 30 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా నాయకులు కేక్ కట్ చేశామని చెప్పారు. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1995 సెప్టెంబరు 1న ప్రమాణ స్వీకారం చేశారని అన్నారు. నాలుగున్నర దశాబ్దాలుగా రాజకీయ ప్రస్థానంలో చంద్రబాబు నాయుడు ఎన్నో మైలురాయులు అధిగమించారని అన్నారు. ముఖ్యమంత్రిగా, మంత్రిగా చంద్రబాబు నాయుడు నాటి నుంచి నేటి వరకు తెలుగు ప్రజల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఆర్థిక, సాంకేతిక, రైతు సంక్షేమం, విద్యా, ఉద్యోగ రంగాల్లో ఆయన ప్రవేశ పెట్టిన విధా నాలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోతె రాజిరెడ్డి, బింగి వెంకటేశం, మిద్దె ప్రకాష్, తుమ్మనపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన లింగన్నపేట రోడ్డు

గంభీరావుపేట: గంభీరావుపేట, లింగన్నపేట మధ్య ఇటీవల తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు నీట మునిగి కొట్టుకుపోయింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు నర్మల ఎగువ మానేరు మత్తడి దూకుతోంది. ఫలితంగా లింగన్నపేట వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఇటీవల తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. సిద్దిపేట, గంభీరావుపేట కామారెడ్డి మార్గాల మధ్య పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇటీవల నూతనంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం సదరు కాంట్రాక్టర్ పాత బ్రిడ్జిని కూల్చి వేశారు. వాహనాల రాకపోకల కోసం పక్కనే తాత్కాలికంగా మట్టి రోడ్డు వేశారు. పాత బ్రిడ్జి కూల్చి వేసిన స్థలంలోనే కొత్త బ్రిడ్జి కోసం చేపట్టిన పనులు నత్త నడకన సాగుతున్నాయి. వర్షాకాలం రాకముందే హై లెవెల్ బిడ్జి నిర్మాణం కొలిక్కి వస్తుందని ప్రజలు భావించారు. హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం పాత బ్రిడ్జిని కూల్చవద్దని చెప్పినా కాంట్రాక్టర్ వినలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, సెప్టెంబరు 1 : సీపీఎస్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఎంప్లాయీస్ జేఏసీ టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ఎలుసాని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఆదివారం ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి వర్షంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని సాధించుకోవడానికి ఉద్యోగ సంఘాల సభ్యులు పోరాటం చేస్తున్నారన్నారు. సీపీఎస్ పెన్షన్ విధానాన్ని ఖండిస్తూ ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబరు 1ని బ్లాక్‌డేగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి గాజుల సుదర్శన్, అసోసియేట్ అధ్యక్షుడు మెట్ట శ్రీకాంత్, కోశాధికారి రియాజ్ పాషా, ట్రెసా జిల్లా అధ్యక్షుడు అకారాం జయంత్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దోర్నాల భూపాల్‌రెడ్డి, టీటీయూ జిల్లా అధ్యక్షుడు కొండికొప్పుల రవి, సురేష్, టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ, టీఎస్‌టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శర్మనాయక్, బీకూనాయక్, పీజీహెచ్‌ఎం జిల్లా అధ్యక్షుడు లకావత్‌మోతీలాల్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మరాఠి అజయ్, బీటీఏ జిల్లా అధ్యక్షుడు గంగయ్య, ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్, టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షుడు పారిపెల్లి రవికుమార్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమారస్వామి, ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జిల్లా అధ్యక్షుడు సాగర్, ఏఈవో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, సీపీఎస్ నాయకులు జక్కని నవీన్, రవీందర్, చిరంజీవి పాల్గొన్నారు.

సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాలి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 1: దేశంలోని సంస్కృతీసంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో అహల్యాబాయ్ హోల్కర్ జయంతి ఉత్సవాలు ఆదివారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ముందుగా సామాజిక సమరసత వేదిక రాష్ట్ర కన్వీనర్ అప్పాల ప్రసాద్‌తో కలిసి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమరసత సమ్మేళన క్యాలెండర్ ఆవిష్కరించారు. దేశ సమైక్యత కోసం భారత రాజ్యాంగంలో సోదర భావం అనే పదాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పునాది వేశారని పేర్కొన్నారు.

బకాయిల విడుదలకు కృషి అభినందనీయం

- విద్యుత్ సమస్యను పరిష్కరించాలి- సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ విజ్ఞప్తి


కేకే మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1: బతుకమ్మ చీరల బకాయిల విడదలకు కేకే మహేందర్‌రెడ్డి చేసిన కృషిని మరవలేమని సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ సభ్యులు అన్నారు. సిరిసిల్ల పట్టణం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ జేఏసీ సభ్యులు కేకే మహేందర్‌రెడ్డితో సమావేశం అయ్యారు. ముందుగా బతుకమ్మ చీరల బకాయిల విడదలకు కృషి చేసిన కేకే మహేందర్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో ఉత్పత్తి చేయించిన బతుకమ్మ చీరల బకాయిలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల కార్మికులు, ఆసాములు, వస్త్ర పరిశ్రమ యొక్క పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని మూడు ధఫాలుగా దాదాపు రూ. 150 కోట్లు విడదల చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. బతుకమ్మ చీరల బకాయిలను విడదల కోసం ఎంతో కృషి చేసిన కేకే మహేందర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ జేఏసీ ఆధ్వర్యంలో సన్మానించామని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో నాల్గో కేటగిరిలో ఉన్న విద్యుత్‌ను మూడో కేటగిరిగా మార్చడంతో పవర్‌లూం పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ తొలగించారని వాపోయారు. వస్త్ర పరిశ్రమకు గుదిబండగా మారిన విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్, కేకే మహేందర్‌రెడ్డితో చర్చించామని, దానికి వారు సానుకూలంగా స్పందించారని అన్నారు. ఇటీవల సిరిసిల్ల పట్టణంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జరిపిన చండీయాగంకు వస్త్ర పరిశ్రమకు ద్రోహం చేసిన వారిని ఆహ్వానించి సన్మానించారని, వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ విధించిన బీజేపీ ఎంపీని, వస్త్ర పరిశ్రమ సంక్షోభంకు కారణమైన కేటీఆర్‌ను పిలవడం విడ్డూరంగా ఉందని ఆరోపించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభ నివారణ కోసం ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ నాయకత్వాన్ని పిలవక పోవడం దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికైన పద్మశాలి సంఘం నాయకులు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు తాటిపాముల దామోదర్, పంతం రవి, పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కార్యదర్శి ఆంకారపు రవి, కాంగ్రెస్ చేనేత్ సెల్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ బండారి అశోక్, కౌన్సిలర్ వెల్దండి దేవదాస్, బూట్ల నవీన్ పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వహించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1: ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులను నిర్వహిం చాలని ఐపీఎస్ అధికారి భూక్యా రామ్‌రెడ్డినాయక్ అన్నారు. గోర్ బంజారా ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం గర్జనపల్లి గ్రామానికి చెందిన ఐపీఎస్‌భూక్యా రాంరెడ్డి నాయక్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మారుమూల గ్రామం గర్జపల్లి ప్రభుత్వ పాఠశాల నుంచే తన ప్రస్తానం సాగిందన్నారు. . 1989లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం సాధించి మొట్ట మొదటి సారిగా ఖమ్మం జిల్లా వైరాలో పని చేశానని వివరించారు. నాటి నుండి విధి నిర్వహనలో అంకితమై సీఐగా, డీఎస్పీగా ఏఎస్పీగా పదోన్నతులను పొందనని అన్నారు. హైదరాబాద్‌లో సీఐడీ ఏఎస్పీగా బాధ్యతలను నిర్వహిస్తున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం గుర్తించి ఏ గిరిజన బిడ్డకు దక్కని గౌరవం తనకు దక్కిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఐపీఎస్‌ను ఇచ్చి గౌరవించిందని తెలిపారు. కార్యక్రమంలో గోర్ షిక్వాడి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా రాములునాయక్, గోర్ బంజార నాయకులు రాజు నాయక్, హరీష్‌నాయక్, అజ్మీరా రాందాస్, గోవింద్ నాయక్, రవిలాల్‌నాయక్ బాలునాయక్, హజ్‌నాయక్, భానోతూ సంతోష్, లకావత్ మోతిలాల్, రామిరెడ్డి నాయక్, కేపతి నాయక్, గజన్‌లాల్ నాయక్, మదన్‌నాయక్ వన్‌పల్లి ఎంపీటీసీ పద్మసేవియా తదితరులు పాల్గొన్నారు.


రాంరెడ్డినాయక్ దంపతులను సన్మానిస్తున్న గోర్ సమాజ్ సభ్యులు

కేటీఆర్ వైఫల్యంతోనే వరదలు

సిరిసిల్ల టౌన్ సెప్టెంబరు 1: పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కేటీఆర్ వైఫల్యంతోనే సిరిసిల్ల పట్టణంలో భారీ వర్షాలకు వస్తున్న వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనాలోచి చర్యల వల్లే సిరిసిల్ల వరదలకు గురి అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెల్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రణాళికలను రూపొందించి నిధులు కూడా కేటాయించే విధంగా చూసి శాశ్విత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

మున్సిపల్ పాలకవర్గం హర్షం


మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 1: మున్సిపల్ పాలకవర్గం వైకుంఠధామంలో అంతిమ సంస్కా రాలకు రుసుము రూ. 101కి తగ్గించడపై ఆదివారం పట్టణంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సంఘం నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అంతిమ సంస్కారాలకు రుసుము తగ్గించాలని ప్రజల పక్షాన మున్సిపల్ పాలక వర్గంకు, అధికారులకు చేసిన విజ్ఞప్తికి స్పందన వచ్చిందన్నారు. కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కుసుమ గణేష్, కోశాధికారి చిప్ప దేవదాస్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బోగ రాజయ్య, సత్యసాయి సేవ సమితి అధ్యక్షుడు చీకోటి అనిల్, వేముల పోశెట్టి, నల్ల మురళి తదితరులు పాల్గొన్నారు.